# మారిన మా ఊరు

— వుప్పల నరసింహం



**చా**లా మాసాల తరువాత మా ఊరికె ళ్ళాను. ఇప్పుడది ఒకప్పటి ఊరు కాదు. అలాగని బస్తీ కాదు. పరిణామం చెందుతున్న పల్లె... విస్తరిస్తున్న ఊరు. పెంకుటిండ్లు, పూరి గుడిసెల సంఖ్య తక్కువై భవనాలు వెలుస్తున్నాయి. వాహనాలు తిరుగుతున్నాయి. పట్నం పోకడలు పోతూ ఉంది.

అయినప్పటికీ ఊరు చుట్టూ పొలాలు అలాగే ఉన్నాయి. వ్యవసాయ బావులు న్నాయి. మిట్ట పొలాల్లో ద్రాక్షతోటలు వెలిశాయి. కోళ్ళఫారాలు వచ్చా యి. పెద్ద పెద్ద వ్యవసాయక్షేత్రాలు తయారయ్యాయి. కొత్త సంస్కృతి అవతరించింది. మామిడి తోటలు కనుమరుగయ్యాయి. చేదబావులు ఎండిపోయాయి.

దిగుడుబావులను పూడ్చేశారు అందమైన షోరీలు ఉండే స్థలం ఆక్రమణలకు గురైంది ఖాళీ స్థలం దాదాపు కనుమరుగైంది. కాలక్షేపానికిప్పుడు హోటళ్లు కేంద్రమయ్యాయి. కేబుల్ టివి కనెక్షన్ల సంఖ్య పెరిగింది. కోమటి దుకాణాల్లో ఒకప్పుడు కనిపించేఅరల అరల పెట్టే అదృశ్యమై అద్దాల షోకేసులొచ్చాయి. దర్జీ దుకాణాల్లో ఎత్తుఎత్తు బల్లలొచ్చాయి. కొత్త కొత్త మిషన్లు వచ్చాయి. ప్రతి ఇల్లు ఇప్పుడు పట్నం వాసనలను వీస్తోంది.

ఊర్లోని గుడి అందాలు పెరిగాయి. పాతగుళ్ళకు మరమ్మత్తులు చేశారు. గ్రామ దేవతల గుళ్లు కొత్త గోపురాలతో కనిపిస్తున్నాయి. ట్రాక్టర్లు, అప్పుడప్పుడు కార్లు తిరిగేందుకు దారులు కొంత విశాలమయ్యాయి. వీధుల్లో పిల్లల సంఖ్య పెరిగింది. గ్రైండర్లు వచ్చాయి. కారంపొడి మర వచ్చింది. వివిధ సందర్భాలలో అవసరమయ్యే టెంట్లు, వంట పాత్రలు అద్దెకిచ్చే దుకాణాలు వెలిశాయి. పట్నం పోవడానికి అవసరమైతే అద్దెకార్లు వచ్చాయి. పబ్లిక్ టెలిఫోన్ వచ్చింది. అప్పుడప్పుడు సినిమా షూటింగులు జరుగుతున్నాయి. ఇడ్లీలు అమ్మే దుకాణాలు పుట్టుకొచ్చాయి.

పాన్ డబ్బాలు వచ్చాయి. రాజకీయ పార్టీల పతాకాల నెగురవేసే దిమ్మెలు వెలిశాయి. అనేక దుకాణాల ముందు బోర్డులు అవతరించాయి. ఎలక్ట్రికల్ షాపులు, వెల్డింగ్ షాపులు, మోటారు వైండింగ్ షాపులు, మాంసం దుకాణాలు, మంగలి దుకాణాలు వచ్చాయి. ఎద్దుల బండ్ల సంఖ్య తగ్గి వ్యాన్ల సంఖ్య పెరిగింది. ట్రాక్టర్ ట్రాలీలు పెరిగాయి. వీటన్నింటికీ రుణ సదుపాయం కల్పించేందుకు బ్యాంకు వెలసింది.

బలహీన వర్గాలకు కాలనీ వెలసింది. క్రైస్తవులు చర్చి ఏర్పాటు చేసుకున్నారు. మహమ్మదీయులు మసీదుకు మరమ్మతులు చేయించారు. కుంటలను కూడ్చి ప్లాట్లు చేస్తున్నారు. దూర దృష్టి గలవాళ్ళు అప్పుడే ఇండ్లు గడుతున్నారు. పూర్తయిన ఇండ్లు దిష్టిబొమ్మల్లా కనిపిస్తున్నాయి. వ్యవసాయ బావులపై అందమైన భవనాలు వచ్చాయి.

అటు శ్రీకాకుళం, కోనసీమ, ఇటు గుంటూరు ప్రాంతపు వ్యవసాయదారులు మా ఊరికి రావడమేగాక వారితోపాటు కూలి నాలీలను కూడా తెచ్చుకున్నారు. శిగముడిని ఓ పక్కకువేసి, ముక్కుకు ముక్కెర పెట్టి, కమ్మీలు పెట్టి, రవికెలు లేకుండా తిరిగే శ్రీకాకుళం ఆడవాళ్లు తెలంగాణ గడ్డకు కొత్త అందాల్ని తెచ్చారనిపించింది. భిన్నధృవాలుగా కనిపించే తెలంగాణా యాస, శ్రీకాకుళం యాస ఇప్పుడు కలెగలసి పోయాయి మా ఊర్లో. కలలు సైతం ఊహించని గొప్ప పరిణామం ఇది. క్లీనిక్‌లు ఒకటికి నాలుగైయ్యాయి. మందుల షాపు వెలిసింది. షాపులో గిరాకీ పెరిగింది. ఆర్టీసీ బస్సుల రాకపోకలు పెరిగాయి. వివిధ కంపెనీలలో పని చేసే ఉద్యోగస్తుల కోసం ప్రభుత్వ రంగ సంస్థల బస్సులు సైతం వస్తున్నాయి... పాఠశాల గదులు పెరిగాయి. ఆట స్థలం వచ్చింది. గ్రంథాలయానికి కొత్త భవనం, పంచాయితీకి, పశువుల ఆసుపత్రికి కూడా కొత్త భవనాలొచ్చాయి. పాతిక సంవత్సరాల క్రితం నాటి ఊరేనా ఇది? అవి ఆశ్చర్య పడేలా పరిణామం చెందింది.

ఆ రోజుల్లో వడ్ల రామయ్య 'ధాటి' దగ్గరకు రైతులు తెల తెల వారు తుండగానే వచ్చేవారు. తమకు కావలసిన నాగండ్లు, దంతెలు తయారు చేయించుకునేందుకు ఆత్రపడేవారు. ఇప్పుడా రామయ్య లేడు. ఆ 'ధాటి' లేదు. రైతులు ట్రాక్టర్‌పై ఆధారపడుతున్నారు. కమ్మరి రాజయ్య కొలిమి దగ్గర 'తిత్తి' చప్పుడు ఎంతో దూరం వినిపించేది. ఆయన 'సుత్తె' చప్పుడు ఊరంతా వినిపించేది. ఇప్పుడా కొలిమి లేదు, తిత్తి చిరిగిపోయింది. సుత్తె చప్పుళ్లు లేవు. మంగలి బాలయ్య 'కల్ప' పట్టుకుని ఊర్లో తిరుగుతూ, ఇళ్ళ ముందు ఎవరికో ఒకరికి గెడ్డం చేస్తూ కనిపించేవాడు. ఇప్పుడు ఆయన లేడు, ఆయన 'కల్ప' లేదు. ఔసుల (కంసాలి) నారాయణ, ఔసుల బ్రహ్మయ్య ఇంటికి ఆడపిల్లల ముక్కు, చెవులు కుట్టిపించేందుకనో, ముక్కు పుల్లలకనో, చెవి కమ్మలకనో, మగవాళ్ళు 'భటువు'లకనో వెళ్ళేవారు. ఇప్పుడు వాళ్ళ ఇల్లే కూలిపోయింది. పిల్లలు ఉద్యోగాలు చేసుకుంటున్నారు. వేరే చోటకు వెళ్ళారు. ఆ వృత్తిని ఎవరూ చేయడం లేదు.

తెల్లవారగానే ఊర్లో గిలకల చప్పుడు వినిపించేది. ఇప్పుడు కొళాయిలొచ్చాయి. వీధుల్లో అల్లం మొరబ్బావాడు, చెనెపుటానెవాడు, డబుల్ రొట్టె వాడు, జర్దా, కరుకు (పొగాకుపొడి) అమ్మే ముసలమ్మ తిరిగేవాళ్ళు - ఇప్పుడు బేకరీ వెలసింది. కిరాణా షాపులొచ్చాయి.

ఉదయం కాగానే భిక్షమడుక్కోవడానికి ఆడవాళ్లు పాటలు పాడుతూ తిరిగేవాళ్లు, ఈత చాపలు అల్లుతూ రకరకాల పాటలు సుదీర్ఘంగా పాడుతూ అడుక్కునే వాళ్లు, ఫకీర్లు వచ్చేవాళ్లు, బాలసంత, బహిరూపువాళ్లు, చాలా కనిపించే వాళ్లు. ఇప్పుడు వాళ్ల జాడనే లేదు.

కట్టెల మోపులతో లంబాడీ స్త్రీలు పది, పదిహేను మంది వచ్చేవాళ్ళు. ఇప్పుడు చాలా మంది ఇళ్ళల్లో గ్యాస్ కనెక్షన్లున్నాయి. కిరసనాయిల్ స్టౌవ్‌లున్నాయి. కర్రల అవసరం కనిపించడం లేదు.

పట్వారీ, పోలీసు పటేలు, పెద్దపటేల్, మాలీ పటేల్ వ్యవస్థ రద్దు కావడంతో వాళ్ళ చుట్టూ రోజూ గుమికూడి వారి అడుగులకు మాడుగులొత్తే రోజులు పోయాయి. జీతగాళ్ళ సంఖ్య తగ్గింది. ఉదయం లేవగానే పటేళ్ళు జీతగాళ్ళపై చదివే తిట్ల పురాణం తగ్గింది. కావలి వాళ్ళ హడావుడి, నీరుడోళ్ళ సందడి, తలారోళ్ళ సతాయింపు ఇప్పటి వాళ్ళకు తెలిసే అవకాశం లేదు.

పీర్లకొట్టంలో గిన్నెలకు 'కళాయి' వేసే వాడు రావడం లేదు. వెంటనే వృత్తిగల పిట్టల వాండ్లు లేరు. గుడ్డేలుగులను (ఎలుగుబంట్లు) ఆడించే వాళ్లు రావడం లేదు. కంచరోళ్లు రావడం లేదు. తలలపై బుట్టల మూటలతో వచ్చేవాళ్లు కరవైయ్యారు.

చిందు భాగోతం ఆడేవాళ్లు కనిపించడం లేదు. సాదనాసురులు రావడం లేదు. గంగిరెద్దులోళ్లు రావడం లేదు. దొమ్మరాట ఆడేవాళ్లు అగుపించడం లేదు. ఏవేవో విద్యలు ప్రదర్శించే వాళ్లు లేరు. 'అంగడి' అసలే సాగడం లేదు. తమదైన వ్యక్తిత్వంగల వారు, తమదైన ప్రత్యేక 'ముద్ర'తో ఊరంతా తిరుగుతూ అందర్ని పలుకరిస్తూ పరాచికాలాడుతూ, వరసైన వాళ్ళతో సరసాలాడుతూ, అవసరమైతే సహాయం చేస్తూ ఉండే ముసలివాళ్ళ జాడలేదు. గొప్ప వ్యవహార జ్ఞానం, లోకజ్ఞానం గల వాళ్లు కనిపించడం లేదు.

ఉదయం లేచింది మొదలు పడుకునే వరకు ఆగని మాటల హోరుతో అందరిని అదరగొట్టే 'వార్లవోతు' నరసమ్మ, ప్రతిపైసా, 'పెండకడి', కర్రముక్క ప్రతీది విలువైనదేనని జాగ్రత్త పరిచే సుందరమ్మ, మగవాళ్ళతో సమాన పాయలో ఉంటూ అన్ని విషయాలపై అవగాహన గల బాలమ్మ, ఊరంతా తనదే, ఊరి వాళ్ళంతా తన వాళ్ళే వాళ్ళకు ఏ కష్టమొచ్చినా తనకే వచ్చినట్టు బాధపడే ఆదుకునే సొన్నాయిల బాగయ్య, బలమైన ఆకారంతో, భాగవతంలో హాస్యగాని పాత్రవేసే బ్యాగరి నర్సయ్యలాంటి ఎంతో మంది కన్నుమూశారు.

ఇట్లా ఎన్నో పార్శ్వాలు మాయమయ్యాయి. పరిణామం చెందాయి. బలమైన వ్యక్తిత్వం బలహీనమైంది. అద్భుతమైన వ్యక్తులు అంతరించి పోయారు. కొత్త తరం కొత్త కోర్కెలతో దూసుకుపోతోంది. పాతతరం, కొత్తతరం మధ్య ఊహించరానంత వ్యత్యాసం. ఒకే ఇంట్లో పాత తరం వారితో కొత్త తరం వారు కలిసిపోయి ఉంటున్నారు... పరిస్థితుల కనుగుణంగా ఒదిగిపోతూ ఉన్నారు. ఇంతటి పరిణామానికి గురైనా మా ఊర్లో ప్రకృతి అందంగా కనిపిస్తుంది. అప్పుడు రోహిణీ కార్తె ముగియలేదు. చింతచెట్లు పచ్చగా కనిపిస్తున్నాయి. చెట్ల క్రింద బంగారం ఆరబోసినట్టు పూవు పరచుకుంది. వేప చెట్ల క్రింద వేప పండ్లు పసుపుపచ్చగా పరచుకుని వున్నాయి. కానుగాగు లేత ఆకుపచ్చగా అందంగా మెరుస్తోంది. అక్కడక్కడ మామిడి చెట్లు కాయలతో ఉన్నాయి. తుమ్మచెట్లు ఆకు తొడుగుతున్నాయి. రాగి చెట్టు ఆకులు దళసరిగా మారాయి. మునగచెట్టు ఏపుగా పెరిగింది. కొత్త చిగురు తిన్న పక్షుల గొంతులు ఎంతోరమ్యంగా వినిపిస్తున్నాయి. ఎన్ని రకాల పిట్టలు చెట్ల మీద గుంపులు గుంపులుగు వాలుతున్నాయి. ఎగిరిపోతున్నాయి. చెవిపెట్టి వింటే ఎన్నో ధ్వనులు వినిపిస్తున్నాయి. అక్షర మాలకు అందని ధ్వనులు చేస్తూ ఉన్నాయి. ఎంతో చలాకీతనం, వేగం ఆ పక్షుల్లో కనిపిస్తోంది.

కోయిల స్వరం సరేసరి, గువ్వలు, గోరువంకలు సవ్వడిచేస్తూ ఉన్నాయి. కిర్‌కిర్ కిర్ కిర్రుక్‌మని ఓ పిట్ట పయనమవుతూ ఉంది. ఊరపిట్టలు జంటలు, జంటలుగా తిరుగుతున్నాయి. ఆకాశంలో రామచిలుకలు ఎగురుతూ కిలకిల మంటున్నాయి. జామ చెట్టుపైకి రంగురంగుల పిట్టలు వాలినట్టే వాలి ఎగిరిపోయాయి. చింత చెట్టుపైకి కొంగలు చేరాయి. బరువైన రెక్కలను టపటప లాడిస్తున్నాయి.

కాకుల గోల, గూళ్ళకోసం ఎండు పుల్లలు ఏరే యత్నం... కీకీకీకీ మని తోకపిట్ట అరుపు. పావురాల గుడగుడ శబ్దం - చెట్టు క్రింద ఉడుత కిచకిచ, తొండ కీటకాల కోసం పరుగు, వీధిలో కుక్కలు మొరుగుతున్నాయి. కోళ్ల చప్పుడు, కోడిపుంజల కూత, చింత చెట్టుపై తేనెటీగల కదలిక, పాలపిట్టలు, గోరెంకలు, కంజుల శబ్దాలు, ఎక్కడో కొలనులోంచి కప్ప బెకబెక, గుయ్యిమని కీటకాల శబ్దం, కీచ్‌కీచ్‌మని ఏవో పిట్టల అరుపులు, కాకుల కావ్‌కావ్ చప్పుడు...

ఇంటి వరండాలో కందిరీగ, కుమ్మరి పురుగు, రెక్కల పురుగు, చిన్నచిన్న మిడతలు, గోడపైబల్లి, ఎదురింటి పెంకులపై పిల్లి, రాళ్ళ కుప్పలోకి పరుగుదీసిన ముంగీస, బెదిరిన కోళ్లు, మోరీలో పంది - పాత గోడవద్ద గాడిద, మేతకు వెళుతున్న ఎద్దు, దాని మెడలో గంట, సరసరమని కదిలిన పాల పిండె, ఇట్లా ఎన్నెన్నో పక్షుల, పశువుల, క్రిమికీటకాల జాడ అలాగే ఉంది.

మా ఊరి పరిణామం గూర్చి ఆలోచిస్తూ వాకిట్లో కొచ్చి ఆకాశం కేసి చూస్తే పెద్ద మబ్బుతునక వెండి కిరీటం పెట్టుకున్నట్టు ధగధగ మెరిసిపోతుంది. ఎండ ఏటవాలుగా పడుతోంది. ఎండ తీవ్రత లేదు. సన్నగా గాలి వీస్తోంది. గన్నేరు పూల చెట్టు గుబురు మీద నుంచి గాలి వీచింది. ప్రకృతి ఎంతో రమ్యంగా కనిపించింది.

దారిన పోతున్న ఓ ముసలమ్మ ఆగి

''బాగున్నావ్, బిడ్డా? ఎప్పుడొచ్చినవ్??''

అని పలుకరించింది. ఆ పలుకరింతలు, ఆ గొంతులు, ఆ ఆప్యాయతలు, ఆ చనువులు, ఆ లాలిత్వంలో, భూమిలో నుంచి వచ్చిన ఆ పిలుపులో ఒకప్పటి మా ఊరు దర్శనమిచ్చింది. నా గుండె నిండా ఉద్వేగం నిండింది. ●